# తెల్లమచ్చల నల్లక్రోటన్ మొక్క

## నాగరాజు గంధం

'వర్షం పెరిగింది' – అనుకున్నాడు శివకోటి శాస్త్రి.

తను నిలబడ్డ బస్టాప్ నుండి కొద్ది అడుగుల దూరంలో ఎదురుగా కన్పిస్తున్న ఇంటివైపు మరో సారి పరీక్షగా జాగ్రత్తగా చూశాడు. పెద్ద భవంతి కాకపోయినా విశాలంగానే కట్టారు. ఇంటి చుట్టూ ఖాళీగా వున్న జాగాలో పచ్చి చలాన్, రకరకాల పూలమొక్కలతో అందంగా కన్పిస్తోంది.

తదేకంగా ఆ ఇంటి పరిసరాలని గమనిస్తూనే జేబులోంచి వక్కపొడి పొట్లం తీశాడు శివకోటిశాస్త్రి – పొట్లాన్ని అంచువరకూ చింపి ఒక్కసారిగా నోట్లోకి పోసుకుని, దాన్ని జాగ్రత్తగా నలిపి సైడుకాలవలో పడేటట్లుగా విసిరేశాడు. ఉన్నట్లుండి గాలి తిరగడంతో వర్షపు జల్లు బస్టాప్‌లోపలి వరకు తడిపింది – ఒక్కసారి బస్టాపుని వీధుల్ని గమనించాడు వర్షానికి దాదాపు నిర్మానుష్యంగా కనపడుతున్నాయి.



తన చేతిలో ఉన్న గొడుగు తెరిచి ఒక రెండడుగులు ముందుకేసి రోడ్డుకి రెండువైపులా బాగా పరికించి చూశాడు శివకోటిశాస్త్రి దూరంగా ఏవైనా వాహనాలు వస్తున్నాయేమోనని... సాధారణంగా వర్షంలో వేగంగా నడిచే వాహనాల మీద అదుపుండదు చాలామంది డ్రైవర్లకి – 'హిట్ అండ్ రన్ డ్రైవర్ల' గురించి చాలా జాగ్రత్తగా ఉంటాడు శివకోటిశాస్త్రి రోడ్‌కి ఏవైపు నుంచి కూడ ఆ వెహికిల్స్ రావడం లేదు అని నిర్ణయించుకున్నాక ఒక్కసారిగా రోడ్డుమీద అడుగుపెట్టి గొడుగు తెరిచున్నా వర్షంలో తడుస్తూ పరిగెత్తే వాళ్ళకుమల్లె వడివడిగా అడుగులు వేసుకుంటూ 'బస్టాప్ ఎదురింటిని' సమీపించి గేటు తెరుచుకుని లాన్‌దాటి పోర్టికోలోకి వెళ్ళి లోపలి తలుపు ముందు ఆగాడు. ఆరడుగులు రెండంగుళాల భారీ శరీరంతో పరిగెత్తడంతో... కొద్దిసేపు ఆయాసపడ్డాడు శివకోటిశాస్త్రి – మామూలుగానే ఎర్రటి కందగడ్డలా వుండే అతని ముఖం మరింత ఎర్రబారింది... బట్టతల మీద పడ్డ వర్షపు జల్లు నుదుటనున్న గంధపు బొట్టుని పొడుగాటి అతని ముక్కుపైకి కార్చింది. ఆయాసపడుతూనే తన చేతిలోని గొడుగుని నెమ్మదిగా ముడిచాడు... జేబులోంచి చిన్న తువ్వాలు సైజులో వున్న నాప్‌కిన్ తీసి ముఖం తుడుచుకున్నాడు – అలా తుడుచుకుంటూనే కాలింగ్ బెల్ నొక్కాడు. లోపల బెల్ మ్రోగిన శబ్దం బయటికి వినిపించింది. ఒకసారి తల తిప్పి రోడ్డువంక, బస్టాప్ వంక పరీక్షగా చూసి ఎవరూ తనని గమనించటంలేదని నిర్ధారించుని నెమ్మదిగా తల తిప్పేంటంతలో అతని కళ్ళు లాన్‌లో ఒక మూలగా ఆకర్షణీయంగా, విలక్షణంగా, ఒంటిగా ఉన్న ఓ క్రోటన్ మొక్కమీద పడ్డాయి – అలాంటి క్రోటన్‌ను అంతకు ముందెన్నడూ చూసుండ లేదు శివకోటిశాస్త్రి – వర్షంలో తడుస్తూ కన్పించిన తెల్లమచ్చల నల్ల క్రోటన్ మొక్కది. దానికి ఎటువంటి ఆకులు లేవు – కాండమే శాఖలుగా చీలిపోయింది. ''ముదురాకుపచ్చ రంగులో వున్న స్టెమ్ దూరానికి నల్లగా కన్పిస్తోంది, ఆపైన తెల్లటి మచ్చలు... అందంగా అమరాయి'' అనుకున్నాడు.

ఒక్కసారిగా భయంకరంగా ఉరిమింది ఆకాశం – ఆ శబ్దానికి కొద్దిగా ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. తను మ్రోగించిన కాలింగ్ బెల్‌కి రెస్పాన్స్ లేదన్న సంగతి గ్రహింపుకొచ్చి మళ్ళీ బెల్ నొక్కబోయాడు – సరిగ్గా అదే సమయానికి తలుపు తెరుచుకుంది.

తలుపు తెరిచిన ముప్పై

# కొమ్మూరి సాంబశివరావు స్మారక పోటీలో బహుమతి పొందిన కథ

ఐదేళ్ళ స్త్రీని చూడగానే ఆమెవరో పోల్చుకున్నాడు శివకోటిశాస్త్రి – 'చీటీల బేబమ్మ' – మనసులోనే ఉచ్చరించుకున్నాడు.

శివకోటిశాస్త్రిని చూసిన మరుక్షణం ఆమె కళ్లలో ఒక చిన్నపాటి తొట్రుపాటు కదిలింది, ఐతే అది తన ముఖంలోకి తేలకుండా జాగ్రత్తపడిందామె. శివకోటిశాస్త్రి చిరకాల పరిచయస్తుడిలా నవ్వాడు –

''నన్ను శివకోటిశాస్త్రి అంటారమ్మ, ఇన్‌స్పెక్టర్ సి.బి.సి.ఐ.డి. – లోపలికి రావచ్చా?'' – ఒక్క క్షణం అతని కళ్ళలోకి సూటిగా చూసి ముఖంలో ఏ భావం లేకుండా లోపలికి దారిచ్చిందామె – లోపలికి అడుగుపెడుతూనే తన కాలిబూట్లని తీసేసి ఓమూలగా ఉంచి ఎదురుగా కన్పించిన సోఫాలో చనువుగా కూర్చున్నాడు శివకోటిశాస్త్రి –

''ఇలా బురద తొక్కుకుంటూ బూట్లతోనే ఇంట్లోకొచ్చేయడం మీ పిన్నికైతే అస్సలు నచ్చదమ్మాయ్ – నీ ఇంటి గచ్చు పాడుచేద్దామని కాదు అందరికీ కనపడేలా నా బూట్లని అలా తలుపు ముందు ఒదలడం నేనొచ్చిన పనికి సేఫ్‌కాదు.''

అతని సంజాయిషీని పట్టించుకోలేదామె. అతని ఎదురుగుండానే వున్న మరో సోఫాలో కూర్చుని ''చెప్పండి'' అంది.

''పొద్దుటకొచ్చిన వాన సాయంత్రానికొచ్చిన చుట్టం మరోపూటకి పోరని సామెత – ఈ వర్షం చూస్తే అంతేలా వుంది'' కిటికీలోంచి బయటకు చూస్తూ కురుస్తున్న జడివానని ఉద్దేశించి అన్నాడు శివకోటశాస్త్రి.

''ఇంతకీ మీరొచ్చిన పనేంటో చెప్పండి'' కొంచెం కోరగా ధ్వనించిందామె కంఠం.

చటుక్కున తలతిప్పి ఆమెకేసి చూశాడు శివకోటిశాస్త్రి – నల్లటి మనిషామె, ఆడవాళ్ళలో చెప్పుకోదగ్గ ఎత్తరి. కళగల ముఖం, కుడి కనుబొమ్మ దగ్గర గాయం తాలూకు మచ్చ, పెదవులపైన, చేతివేళ్ళ సందుల్లో కనురెప్పల మాటున తెల్లని మచ్చలు – 'బొల్లి కాబోలు గుంటకి... అయినా బానే వుంది'' మనసులో భావాలేవీ పైకి తేలకుండా ప్రశాంతంగా నవ్వి –

''మీ ఆయన హత్య కేసు గురించి నీతో కాస్త మాట్లాడవలసి ఉందమ్మాయ్''

''దాని గురించి ఆరోజే స్టేట్‌మెంట్ తీసుకున్నారుగా...''

చిన్నగా నవ్వాడు శివకోటిశాస్త్రి – ''ఊ... తీసుకున్నారనుకో... ఆ స్టేట్‌మెంట్ మీ ఆయన మర్డర్ అవ్వటం గురించి... ఇప్పుడు నేను మాట్లాడబోయేది మీ ఆయన చేసిన మర్డర్ గురించి''.

పరిశీలనగా ఆమె కళ్ళలోకి చూస్తూ ఒక్కోమాట నెమ్మదిగా అన్నాడు శివకోటిశాస్త్రి.

లిప్తపాటులో ఆమె కళ్ళలో కదిలిన భయం అతని దృష్టిని దాటిపో



లేదు.

''మీరు మాట్లాడుతోందేంటో నాకర్థం కావడం లేదు... మా ఆయన 'బెల్లుసూరి'ని చంపేశారుగా. చచ్చినోడు మర్డర్ చేయడమేంటి?'' అర్థం కానట్టు అడిగింది.

బింకం చెదరకుండా మాట్లాడుతోంది – అనుకున్నాడు శివకోటిశాస్త్రి మనసులో. ముఖాన చిరునవ్వు చెరగనీకుండా తను వేసుకున్న రెక్సిన్ కోటు జిప్ తీసి లోపలినుంచి ఓ కవర్ తీశాడు – దాన్ని నెమ్మదిగా ఎదురుగా వున్న టీపాయ్ మీద పెట్టి, రెక్సిన్ కోటును పూర్తిగా విప్పుదీసి సోఫాలో ఓ పక్కగా వుంచి, షర్టు జేబులోంచి కళ్ళజోడు కేసు తీసి అందులో కళ్ళద్దాలని ఒక్కసారి శుభ్రంగా తుడుచుకుని కళ్ళజోడు పెట్టుకుంటూ –

''మామూలు రోజువారి పనులు డ్రైవింగ్ వరకూ వీటితో పనిలేదమ్మాయ్ – టి.వి. చూడాలన్నా, ఇదిగో ఇలా ఏదైనా చదవాలన్నా కళ్ళజోడు లేకుండా పనికాదు'' అన్నాడు టీపాయ్ మీదున్న కవర్‌లోంచి పేపర్ కట్టలను బయటకు తీస్తూ –

అతని మాటలని విననట్టుగా ఉండిపోయిందామె, అతని చేతిలోని పేపర్లని ఆసక్తిగా గమనిస్తూ.

కొద్దిసేపు శివకోటిశాస్త్రి ఏమీ మాట్లాడలేదు. దీక్షగా తను తెచ్చిన పేపర్లని చూసుకుంటూ ఓ క్రమంలో వాటిని సర్దుకున్నాడు. కొద్దిక్షణాల తర్వాత తనవంకే చూస్తున్న ఆమెవైపు సాలోచనగా చూసి – తన చేతిలో ఉన్న కాగితాల కట్టలో పైనున్న దొంతర ఆమెకు కనపడేటట్లుగా ఆమెవైపు తిప్పి పట్టుకుని – ''ఇది పి.ఎమ్. రిపోర్టమ్మా... మీ ఆయన బెల్లుసూరి బాడీగా ఐడెంటిఫై చేసిన శవం తాలూకు పోస్టుమార్టం రిపోర్టు – దీని ప్రకారం అయితే 'శవం' మీ ఆయన పేర్న రిజిష్టర్ అయిన మారుతి జెన్ డ్రైవింగ్ సీట్లో పూర్తిగా కాలిపోయిన స్థితిలో దొరికిందమ్మాయ్... ఆఫ్‌కోర్స్ కారు కూడా పూర్తిగా కాలిపోయిందనుకో... ఎడమచేతి చూపుడువేలికి మెల్టయిన ఉంగరం... కాలిపోయిన సెల్‌ఫోను ఆధారంగా ఆ శవం మీ ఆయనదే అని ఐడెంటిఫై చేశారు, దాన్ని నువ్వు కూడా కన్‌ఫర్మ్ చేశావు – ఇంతవరకూ బాగానే వుంది'' ముక్కున జారిన కళ్ళజోడు తీసి టీపాయ్ మీద పెట్టాడు శివకోటిశాస్త్రి.

''పెట్రోలు టాంకు అంటుకుని కాలిపోయిన మారుతీ జెన్‌లో దొరికిన మీ ఆయనదే అని జనం అనుకుంటున్న శవం కిరసనాయిలు వాసన వస్తున్నట్టు ప్రైమరీ అబ్జర్వేషన్‌లో రాసుందమ్మాయ్''.

''అవును ఆ రంగసాయిగాడు ఆయన మీద కిరసనాయిలు పోసి అంటించి ఆ తరువాత పెట్రోలు టాంకు అంటించాడు'' బింకంగా చెప్పిందామె.

''రంగసాయంటే మీ పసిడి చిట్స్‌లో పార్టనర్ కదా! రైట్ అతని సంగతికి తర్వాత వద్దాం'' క్రీగంట ఆమెని చూస్తూ తన చేతిలో ఉన్న దొంతరలోంచి మరో పిన్ చేయబడున్న పొత్తిని తీశాడు.

''ఇది డెల్టాకేర్ హాస్పిటల్స్ తిరుపతి వారిచ్చిన మెడికల్ సర్టిఫికెట్... ఇందులో వివరాలు నీకు తెలుసుననుకో. అయినా నా తృప్తికోసం మరోసారి వినమ్మాయ్... పందొమ్మిది వందల తొంభై తొమ్మిది దాదాపు ఐదేళ్ళ క్రితమే అనుకో, ఆగస్టు రెండో తారీకు ... అలిపిరి దగ్గర జరిగిన యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడి హాస్పిటల్‌కి తేబడిన దేవర సూర్యనారాయణకి అంటే మీ ఆయన బెల్లుసూరికి – అవసరమైన ప్రాథమిక చికిత్స, తదనంతర ఎమర్జెన్సీ చికిత్స అంటే ఆపరేషను మా హాస్పిటల్‌లోనే జరిగిందని వాళ్ళు సర్టిఫై చేశారు, దాని తాలూకు హాస్పిటల్ రికార్డ్స్... అలానే శ్రీమతి దేవర బేబికి కూడా చిన్నవైద్యం చేశామని రాశారనుకో... ఆరోజు ఆ యాక్సిడెంట్ జరిగిందని కన్‌ఫర్మ్ చేసే పోలీసు ఎఫ్.ఐ.ఆర్. కాపీ, ఆ తర్వాత యాక్సిడెంట్ అయిన టాటా సుమో నీ పేర్న వుండటంతో నువ్వు క్లైమ్ చేసుకున్న ఇన్సూరెన్స్ వివరాలు.... ఇంకా ఏవో పోలీసులవి, డాక్టర్లవి స్టేట్‌మెంట్లు... అన్ని కలిపిన రికార్డమ్మా ఇది'' – తన చేతిలోని కాగితాల పొత్తిని ఆమె కళ్ళముందు ఆడించి టీపాయ్ మీద పడేశాడు శివకోటిశాస్త్రి.

కొద్దిపాటి అసహనంగా చూసిందామె అతనివైపు – ''అయితే ఏంటి? నేనేం తిరుపతిలో యాక్సిడెంట్ జరగలేదనడం లేదే... దానికి, మా ఆయన హత్యకి ఏంటి సంబంధం?'' చివరి మాటలు పలికేటప్పుడు ఆమె గొంతు తీవ్రంగా ధ్వనించింది.

ఆ తీవ్రతని గుర్తించకపోలేదు శివకోటిశాస్త్రి ... రెండు వేళ్ళతో కనుబొమల్ని ఒక్కసారి బలంగా రుద్దుకుని – ''ఏమిటో పిచ్చితల్లీ బాడ్‌లక్...'' అంటూ గాఢంగా నిట్టూర్చి నింపాదిగా సోఫాలో వెనక్కి జారిగిలపడి –

''ఆ హాస్పిటల్ శ్రాష్టులు అంతవరకే సర్టిఫికెట్ ఇచ్చి ఊరుకోలేదమ్మా... మీ ఆయన ఎడమ తొడ ఎముక మల్టీఫ్రాక్చర్ అయిన కారణంగా ఆపరేషన్ చేసి 'స్టీలు రాడ్' వేసినట్టుగా కూడా రాశారు. మరిక్కడ అందరూ మీ ఆయనదే అనుకుంటున్న శవం తాలూకు పి.యమ్. రిపోర్టులో ఎడమ తొడ దగ్గరుండవలసిన స్టీలు రాడ్ కనిపించకపోగా మామూలు ఎముకే కన్పిస్తోందమ్మా...''

శివకోటిశాస్త్రి మాటలు ఆమెకి నెమ్మదిగా అర్థమయ్యాయి. అర్థమవుతున్నకొద్దీ క్రమంగా ఆమె ముఖం గట్టిగా బిగదీసుకున్నట్టుగా అయిపోయింది.

''దీన్నిబట్టి ఏం తెలుస్తోంది? నీ ఐదోతనం గట్టిది – చచ్చింది మీ ఆయన బెల్లుసూరి కాదు... మొత్తానికి అదృష్టవంతురాలివి తల్లీ'' – నవ్వుతూ అన్నాడు శివకోటిశాస్త్రి.

అతని నవ్వుని చూసి కొంచెం కూడదీసుకుందామె – ''ఆరోజు చీట్ల వసూలుకని ఈయన రంగసాయి కలిసి కార్లో వెళ్ళారు, అంతే తిరిగి రాలేదు. వసూలైన డబ్బంతా దోచుకుని ఈయన్ని అన్యాయంగా చంపి కాలబెట్టి పారిపోయిన రంగసాయిగాడ్ని వదిలేసి చచ్చింది ఈయన కాదని చెబుతారేంటి? కార్లో దొరికిన సెల్‌ఫోన్ ఈయనదే, వేలికున్న ఉంగరపు రాయి ఈయనదే...''

ఆమె మాటలకి మధ్యలోనే అడ్డుతగిలాడు శివకోటిశాస్త్రి – ''ఒక్క 'శవం' తప్ప అన్నీ మీ ఆయన తాలూకేనమ్మ, ఒప్పుకుంటాను – ఆ శవం మాత్రం రంగసాయిది, అది నువ్వొప్పుకోవాలి...'' ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

''ఏం కాదు...ఆ రంగసాయిగాడే వాళ్ళావిడతో ఈనకి సంబంధం ఉందని కక్షపెంచుకుని ఈన్ని కాలబెట్టాడు. మీరు చెప్పేవన్నీ అబద్ధాలు'' కొంచెం ఆవేశంగా అందామె.

పకపక నవ్వాడు శివకోటిశాస్త్రి – ''రంగసాయి భార్య...'' కళ్ళజోడు పెట్టుకుని తన చేతిలో వున్న మరో పేపర్ని ఆమె ఒళ్ళో పడేటట్టుగా విసిరేశాడు – అదో మారేజి రిజిస్టర్ కాపీ – ''మీ ఆయనకి రంగసాయి భార్య అని నువ్వు చెబుతున్న కాటం కుసుమకుమారికి రెండువేల సంవత్సరం జనవరి నాలుగో తేదీన పెళ్ళి జరిగినట్టుగా సాక్ష్యం – తన రెండో పెళ్ళానికి మొగుడిగా ఒకడిని నటింపజేసే ఏర్పాటు నీ బలవంతం మీదనే మీ ఆయన చేశాడని నాకు తెలుసునమ్మాయ్ – నేనేం తప్పుబట్టనమ్మ ... సంఘానికి భయపడి మనం కొన్నిసార్లు కొన్ని ఏర్పాట్లు చేసుకోక తప్పదు. కాకపోతే లోకం కోసం ఏర్పాటుచేసుకున్న మొగుడు, అసలు మొగుడు మీద కక్ష పెంచుకోవడం... చంపడం...

### రచయిత పరిచయం



పుట్టి, పెరిగి, చదివి, ప్రస్తుతం నివసిస్తోంది నరసరావు పేటలోనే. కంప్యూటర్ మేనేజ్‌మెంట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ, వ్యక్తిగతంగా ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌ని, వృత్తిపరంగా సాహిత్యాభిలాష, ఇంతకుమించి పెద్ద వ్యక్తిగత వివరాలేమీ లేవు. డిటెక్టివ్ సాహిత్యం అంటే ఓ ప్రత్యేకానురక్తి. ఆ క్రమంలో ఆరుద్ర, కొమ్మూరి, మల్లాది, ప్రతాపరవిశంకర్‌ల కథలు విపరీతంగా చదివాను. ఎన్నో లభ్యంకాని డిటెక్టివ్ పుస్తకాలను సేకరించి నాచేత చదివించిన వాడు మా బావ గణపతి, ఆ చదువరితనమే ఈ కథకు స్ఫూర్తి. అందుకు వాడికి, 'నవ్య'లో నా మొదటి కథకే బహుమతినిచ్చి ప్రోత్సహించిన సంపాదకవర్గానికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

– నాగరాజు గంధం

పెద్దగా అతకవమ్మాయ్...'' గొంతులో మార్దవం ఏమాత్రం సడలకుండా చెప్పాడు శివకోటిశాస్త్రి.

తన ఒళ్ళోపడ్డ మారేజి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వైపు శివకోటిశాస్త్రి వైపు నిలువు గుడ్లేసుకుని చూస్తూ వుండిపోయిందామె.

''ఇంతేకాదమ్మా, ఇంకా చాలా ఉన్నాయ్. మీ చిట్‌ఫండ్ పరిస్థితి, ఊళ్ళో మీ ఆయన చేసిన అప్పులు. ఈ సంఘటన జరగటానికి నెలరోజుల ముందునుంచి మీ ఆయన చేసుకున్న చిట్‌ఫండ్ వసూళ్ళు దాదాపు కోటి... అందులో రూపాయి కూడా ఎవ్వరికి జమపడలేదు... సరిగ్గా రెండునెల్లా పదిహేను రోజుల క్రితం తన పేరనున్న ఆస్తులన్నీ నీ పేరుకి మార్పించాడు... ఇకపోతే రంగసాయి.. మీ ఇంటికుక్క.. దాదాపు మీ ఆయన వయసే, అదే హైటు. అవసరమూ, పరిస్థితీ కూడా అలానే కలిసొచ్చాయి... శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు. మీ కష్టానికి మీకు తోచిన మార్గం అదీ. ఏదో అనుకున్నారు, చేసేశారు, ఐపోయింది... నేను మీ గురించి పూర్తిగా ఎంక్వైరీ చేశాను తల్లీ... విశాఖపట్టణం జగదాంబ సెంటర్లో బెల్టులు అమ్మేవాడు మీ ఆయన, చిన్నసైజు ఆకురౌడీగా ప్రారంభమయ్యాడు... పూర్ణా మార్కెట్లో టీస్టాలు నీది. అక్కడ నీ పేరు 'చీటీల బేబి' – ఏదో కలిశారు, కష్టపడ్డారు, నాలుగు రాళ్ళు పోగేసుకున్నారు. మార్కెట్లో ఓ పదిహేను లక్షలకి బొక్కపెట్టి అక్కడినుంచి ఇక్కడికొచ్చేశారు అని గిట్టనివాళ్ళు చెబుతారు. అటువంటి పాపపు మాటలు ఆ చెవితో విని ఈ చెవితో వదిలేస్తానమ్మాయి నేను – ఎవరి కష్టం వాళ్ళది. రోడ్డు మీద రూపాయి దొరికితే తీసుకుంటానికి భయపడే గాడిద కొడుకులు ఇటువంటి మాటలు మాట్లాడుతుంటారు. ఇక్కడికొచ్చి మీరు సుఖపడ్డారని నేనేం అనుకోనమ్మ – ముఖ్యంగా నువ్వు... కొత్తచోటు, కొత్త ముఖాల మధ్య నెగ్గుకురావడం అంటే.. సులువా? ఏదో నీ అదృష్టం, కాలం కలిసింది. కొంపాగోడు అమిరాయి. దాంతోపాటే మీ ఆయనకి తిరుగుళ్ళు, సరదాలు, ఖర్చులు కూడా ముదిరాయి... నీ మాట లెక్కపెట్టకుండా రకరకాల స్టెప్పు వేశాడు... ఈ సంవత్సరం రియల్ ఎస్టేటు, సినిమా డిస్ట్రిబ్యూషను దెబ్బేశాయ్... మళ్ళీ ఇటూ అటూ అయ్యారు... కష్టాలు వచ్చాయి, అదే సమయానికి మంచి ఆలోచనా తట్టింది – మంచి ప్లానే, డెఫినెట్‌గా నీ బుర్రే అయ్యుంటుంది... మీ ఆయనకైతే ఇంత కెపాసిటీ లేదు.. కాకపోతే నమ్మకస్తుడు రంగసాయి అల్పాయుష్కుడయ్యాడన్న చిన్న బాధ తప్పితే... మనుష్యులు శాశ్వతమా... ఏదిఏమైనా చిట్‌ఫండ్ వసూళ్ళు మొత్తం మిగిలిపొయ్యాయి... అప్పులాళ్ళకి చిట్‌ఫండ్ ఆఫీసులో కుర్చీలు, ఫాన్లు వరకే దక్కుదల, కొద్దికాలం ఆగి అంతా సర్దుకున్నాక నువ్వు నెమ్మదిగా బిచాణా ఎత్తేసి అల్లుడిగారి దగ్గరకే వెళ్ళిపోవచ్చు... ఇంకేవో చిన్నచిన్న పొరబాట్లుంటాయ్... నాలాంటి చాదస్తపు ముండాకొడుకు పట్టించుకుని పట్టుకుంటే సంగతి, లేకపోతే లేదు'' – సోఫాలోంచి లేచి నిలబడి జేబులోంచి వక్కపొడి పొట్లం తీసి, దాన్ని ఒకేసారి చించి నోట్లో పోసుకుని పొట్లం జాగ్రత్తగా జేబులోకి పెట్టుకున్నాడు శివకోటిశాస్త్రి.

**కూతురులాంటి దానివి నీ దగ్గర నాకు దాపరికమేంటమ్మ? ఇది నా అఫీషియల్ విజిట్ కాదు. మరో ఆర్నెల్లకి రిటైర్ అవ్వబోతున్నాను – నీ ఉసురు పోసుకుందామన్న ఆలోచన లేదు – అలా అని మీరు కష్టపడి ముడుచుకుందంతా ఒల్లుకుందామన్న అత్యాశా లేదు – వయా మీడియాగా నీకు నెప్పి లేకుండా ముప్పులేకుండా ఓ సెటిల్‌మెంట్‌కి ఒచ్చేద్దాం.**

''ఇప్పుడు మీరెందుకొచ్చారు?'' అతనివైపు నిశ్చలంగా చూస్తూ అడిగిందామె.

ఈ ప్రశ్నతో ఆమెవైపు ప్రసన్నంగా చూశాడు శివకోటిశాస్త్రి – ''కూతురులాంటి దానివి నీ దగ్గర నాకు దాపరికమేంటమ్మ? ఇది నా అఫీషియల్ విజిట్ కాదు. మరో ఆర్నెల్లకి రిటైర్ అవ్వబోతున్నాను – నీ ఉసురుపోసుకుందామన్న ఆలోచన లేదు – అలా అని మీరు కష్టపడి ముడుచుకుందంతా ఒల్లుకుందామన్న అత్యాశా లేదు – వయా మీడియాగా నీకు నెప్పి లేకుండా ముప్పులేకుండా ఓ సెటిల్‌మెంట్‌కి ఒచ్చేద్దాం. ఇప్పుడు నేను నీముందుంచిన సాక్ష్యాలన్నీ ఎండకీ వానకీ ఒళ్ళు పులుసు పచ్చడి చేసుకుని నే సంపాదించినవే... మరో మనిషి ప్రమేయం లేదు... ముప్ఫై రెండేళ్ళు ఈ డిపార్ట్‌మెంట్‌కి, దాన్నేలిన దొరలకి సేవ చేశాను.. ముండమోపి చిన్న ఎసిబి కేసులో పట్టుకుని ఈ రివర్టు చేసి రెండేళ్ళు వి.ఆర్‌లో ఏడిపించి రిటైరైపొయ్యే ముందు ఈ పొజిషన్లో ఉంచారు... సరే నా దురదృష్టమూ నీ అదృష్టమూ, సరైన టైముకి సరైన చోట వున్నాను – కనుక నువ్వు బాగా ఆలోచించి ఓ నిర్ణయాని కొస్తే... నీ పిన్ని నీతో చెప్పమన్న రెండు ముక్కలు అనేస్తాను'' ఎక్కడా తడబాటు లేకుండా తాపీగా అనేశాడు శివకోటిశాస్త్రి.

అతనూహించినట్టు ఎటువంటి ఒప్పుదల వెంటనే కనపడలేదామె ముఖంలో. కింద పెదవిని పైపంటితో కొరుకుతూ మౌనంగా ఉండిపోయింది. కూర్చున్న సోఫాలోంచి ముందుకు వంగి ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు శివకోటిశాస్త్రి.

''నేను మా ఆయన తప్పుకోగలం – ఈ బట్టతలగాడితో బేరాలేంటి అనుకోకమ్మా... గట్టిగానే ఇరికారు.. మీ ఆయన వెంటనే దొరకకపోయినా కుసుమకుమారి ట్రేస్ అవ్వటం పెద్ద విషయం కాదు – నీ వెర్రికాని తల్లి పట్టుదలొచ్చి ప్రయత్నిస్తే అల్లుడుగారు మాత్రం ఎంతకాలమని తప్పుకు తిరగ్గలరు? అవ్వన్నీ ఒదిలేయ్, నీకు మాత్రం గాలాడాలా? పొద్దస్తమానం పోలీసు వెధవల నిఘాకింద ఉండటం... ఘోష కదమ్మా... ఇంతవరకూ మీరు జాగ్రత్తగానే ఉన్నారు. నీకొచ్చే ఫోన్‌లు వింటున్నాం... నీ సిమ్‌కార్డుల భోగట్టా మా దగ్గరుంది... ఇంటిమీద నిఘా ఉంది. రాకపోకలు రికార్డు చేసుకుంటున్నాం – ఇలా ఓ రెండు నెలలు గట్టిగా జరుగుతుంది. మరో పదిహేను రోజుల్లో ఎస్పీ ట్రాన్స్‌ఫర్ అవుతున్నాడు... దాంతో లోకల్





## జయేద్ లవ్‌స్టోరీ

తండ్రి సంజయ్‌ఖాన్ అండ వున్నా కూడా జయేద్‌ఖాన్‌కి సరైన అవకాశాలు రావడం లేదు. అందగాడైనా ఈ ఖాన్‌కి సొంత సంస్థలో నటించడం అంతగా ఇష్టంలేదు. మన సినిమాలో మనం నటిస్తే గొప్పేంటి అంటాడు. ఈ కుర్రాడిప్పుడు ఫైట్ క్లబ్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా కొరియా నుంచి యాక్షన్ డైరెక్టర్లు వస్తున్నారు. దీంతో మంచి బ్రేక్ వస్తుందని జయేద్ ఆశ. ఈమధ్య 'శబ్ద్' సినిమాకోసం గోవా అవుట్‌డోర్ వెళ్ళి ఐశ్వర్యారాయ్‌తో ప్రేమకథ నడిపాడని జయేద్‌పై పుకార్లొచ్చాయి. 'ఐశ్వర్య చాలా అందగత్తె, ఆమెను చూసి ఎవరైనా ఆకర్షణకు గురవుతారు. నేను కూడా అంతే. మేమిద్దరం ఒక బార్‌లో కూర్చుని ఒక పెగ్ మందు తాగాం అంతే' అని సిగ్గుపడుతూ చెబుతున్నాడు జయేద్.

పోలీసులు పట్టు తగ్గిస్తారు... దాంతో బిగువు అదే సడలిపోతుంది... ఇక మా సంగతంటావా? నేను ప్రత్యేకంగా కెలక్కపోతే జాగ్రత్తగా ఫైలు క్లోజైపోతుంది... ఇక ఇదంతా నీ తెలివితేటల మీదే ఆధారపడుందనుకో..''

ఈ మాటలు వింటూ ఆమె గోళ్ళు గిల్లుకుంటూ తలదించుకుని ఉండిపోయింది. ఆమె మౌనం శివకోటశాస్త్రిలో ఏదో మూలనున్న అసహనాన్ని రెచ్చగొట్టింది. టీపాయ్ మీదున్న కాగితాల్ని సర్దుకున్నాడు.

''ఏదో పెద్దముండవాణ్ణి – ఆడకూతురువని చెప్పాను. ఆలకిస్తే మంచిది, లేకపోతే ఇంత కూపీ లాగినవాణ్ణి మీ ఆయన్ని మటుకు ట్రేస్ చేయలేనా? ఇప్పటికే కర్ణాటకలో ఉన్నట్టు లీడ్ దొరికింది. మరి కాస్త శ్రమపడితే ఓ వారం పదిరోజుల్లో పట్టుకుని లోపల దొబ్బలేను'' మొదటిసారిగా శివకోటిశాస్త్రి గొంతులో పోలీసుతనం ధ్వనించింది.

చటుక్కున తలెత్తిందామె – ''పిన్ని చెప్పింది రెండు ముక్కలు అన్నారు... చెప్పండి'' అందామె ప్రశాంతంగా అతని కళ్ళలోకి చూస్తూ.

నొచ్చుకున్నట్టుగా నవ్వాడు శివకోటిశాస్త్రి. మంచిపిల్లవే... ఈ ముక్క కాస్త ముందుగా అంటే ఏమ్మా? చప్పున మాట తూలిపోయాను కదా – అన్నాడు బాధగా ముఖంపెట్టి. ఒక్కక్షణం తర్వాత రెండు చేతుల్ని దగ్గరగా పెట్టుకుని కొద్దిగా ముందుకు వంగి ఆమెవైపు చూస్తూ చెప్పాడు – ''నీకు ఇద్దరు చెల్లెళ్ళు అమ్మాయ్ – పెద్దదాన్ని అమెరికాలో ఇచ్చాను ... రెండోదాన్ని అక్కడికే పంపితే... ఈ ముష్టి ఉద్యోగం ముగించుకుని, నేను మీ పిన్ని కూడా అక్కడికే చేరదాం అని నిర్ణయం – దీనికంతా ఓ యాభై లక్షలు అవుతుంది – నేను సగానికి తూగగలను, మిగతా సగం నీది – నీ పరిస్థితికి ఇది పిరిమవ్వదు – ఆడపిల్ల సొమ్ముని అవసరానికి మించి ఆశించేవాణ్ణి కాదు నేను – తొందరలేదమ్మా... ఓ వారం టైమ్ తీసుకో, ఈలోగా డిపార్ట్‌మెంట్‌లో కూడా ఏవన్నా చిన్నచిన్న టంకాలు అవసరమైతే నేచూసుకుంటాను – నెమ్మదిగా ఆలోచించుకో – నువ్వు బేరం ఆడాల్సిన ముక్కనే అనలేదు'' సర్దుకున్న కాగితాలని తీసి జర్కిన్ పాకెట్‌లో పెట్టుకున్నాడు.

''దీనికోసమని పొరపాటున కూడా అల్లుడుగారిని కాంటాక్ట్ చేయకు. అది మొదటికే ప్రమాదం... చెప్పాను కదా కర్ణాటకలో మూమెంట్ ఉన్నట్టు లీడ్ ఉందని'' – నెమ్మదిగా లేచి వెళ్ళి ఓ మూలగా ఉంచిన బూట్లు తెచ్చి వేసుకున్నాడు. ''ఏమాత్రం నెమ్మదితనం తప్పకమ్మ, నిమ్మళంగా నిర్ణయించుకో'' – గొడుగు చేతిలోకి తీసుకుని కిటికీలోంచి బయటకు చూసి – ''వెధవ వర్షం ఇంకా తగ్గలేదమ్మాయ్...'' అని ముందుకు నడవబోయి ఆగి కిటికీలోంచి కనబడుతున్న తెల్లమచ్చల నల్ల క్రోటన్ మొక్కను చూసి –

''ఆ మొక్క ఎంత విచిత్రంగా ఉందమ్మాయ్? దాని పేరేంటి?'' అడిగాడు శివకోటిశాస్త్రి.

ఆమె ఆ మొక్కవైపు చూసింది – ''తెలీదండి... ఏదో వెరైటీ క్రోటన్'' అంది.

'బాగుంది నీ లాన్' అని మనసులో అనుకుని పైకి మాత్రం – ''నాకంతకాదుగాని మీ పిన్నికి మాత్రం ఒకటే పిచ్చనుకో ఈ మొక్కలంటే... మరి నే వెడుతున్నాను, నువ్వు జాగ్రత్తమ్మా.. తలుపువరకూ రానవసరం లేదు. నే తలుపేసి వెళ్ళిపోతాను. నే చెప్పినవన్నీ జాగ్రత్తగా ఆలోచించుకుని డిసైడ్ అవ్వమ్మా'' అంటూ ఆఖరిసారిగా చెప్పి హడావుడిగా అడుగులు వేసుకుంటూ తలుపు తెరుచుకుని క్షణంలో అక్కడినుండి వెళ్ళిపోయాడు శివకోటి శాస్త్రి.

అతను వెళ్ళిన కొద్దిక్షణాల వరకూ స్తబ్దుగా వుండిపోయిందామె – నెమ్మదిగా కిటికీ దగ్గరకెళ్ళి బయట కురుస్తున్న వర్షాన్ని చూస్తూ ఉండిపోయింది – 'మీ ఆయన కర్నాటకలో తిరుగుతున్నట్టు లీడ్ దొరికింది' అన్న శివకోటి శాస్త్రి మాటలు గుర్తుకొచ్చాయి – అప్రయత్నంగా ఆమె చూపులు వర్షంలో తడుస్తున్న తెల్లమచ్చల నల్లక్రోటన్ మొక్క మీద పడింది... లాన్‌లో పడ్డ వర్షపు నీరంతా క్రోటన్ మొక్క మొదట్లోకే వచ్చి చేరి ఇంకుతోంది... అలా తదేకంగా ఆ మొక్కవైపే చూసిన ఆమె ముఖాన చిన్న చిరునవ్వు ప్రారంభమైంది... అది నెమ్మదిగా పెరిగి పెద్దదై విరగబడి నవ్వడం ప్రారంభించిందామె... అలా నవ్వుతూనే ఉండిపోయింది చాలాసేపు... మధ్యమధ్యలో క్రోటన్ మొక్కవైపు చూస్తూ తెరలు తెరలుగా నవ్వుకుంది... అలా నవ్వుకుంటూనే అనుకుందామె –

''ఈ బట్టతల గొట్టంగాడికి బెల్టుసూరిగాడు కర్నాటకలో తిరుగుతున్నట్టు లీడు దొరికిందా? ఆ క్రోటన్ మొక్కకి మూడడుగుల కింద ఆరడుగుల వెడల్పున సమాధై తొంగున్న బెల్టుసూరిగాడి లీడు బట్టనెత్తోడికి కర్నాటకలో...'' విరగబడి నవ్వుకుంటూనే ఉందామె.

వర్షంలో తెల్లమచ్చల నల్ల క్రోటన్ మొక్క తడుస్తూనే ఉంది.

★